
సాక్షి ఒడిశా
సోమవారం । 20 । మే । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు
భువనేశ్వర్‌: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.7,28,826లు, బంగారం 550 మిల్లీగ్రాములు, వెండి 110 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.




గజపతిలో గట్టెక్కేనా?
జిల్లాలో రెండు స్థానాల్లో గెలుపు కోసం బీజేడీ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. గత ఎన్నికల్లో రెండు చోట్లా అభ్యర్థులు ఓడిపోయారు.
- 8లో



రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి
జయంతగిరి కాలనీ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.
- 8లో

పోలింగ్ నేడే



- రెండో విడత ఎన్నికల బరిలో మహామహులు
- 305 మంది అభ్యర్థులు.. 79 లక్షల మంది ఓటర్లు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

భువనేశ్వర్‌: రాష్ట్రంలో సోమవారం జరగనున్న రెండో విడత పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. అత్యంత ప్రాధాన్యత ఉన్న ఈ విడతలో మహామహులు తలపడుతున్నారు. ప్రధానంగా అధికార బిజూ జనతా దళ్‌, విపక్షం భారతీయ జనతా పార్టీ మధ్య పోరు హోరాహోరీగా ఉంటుంది. కాంగ్రెసు ఉనికిని పరిరక్షించుకునే దిశలో బలమైన పోటీనిచ్చేందుకు రంగం సిద్ధం చేసుకుంది. ఈ దశలో ఐదు లోక్‌సభ, 35 శాసనసభ స్థానాల్లో 305 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరి భవితవ్యం 79 లక్షల మంది ఓటర్లు నిర్ణేతలుగా ఓటు వేయనున్నారు.

- ఈ విడత పోలింగ్‌లో బిజూ జనతా దళ్‌ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నవీన్‌ పట్నాయక్‌, భారతీయ జనతా పార్టీ నాయకుడు, మాజీ కేంద్ర మంత్రి జుయల్‌ ఓరమ్‌, మాజీ భారత హాకీ కెప్టెన్‌ దిలీప్‌ టిర్కీ, మాజీ కేంద్ర మంత్రి దిలీప్‌ రాయ్‌, హ్యాట్రిక్‌ విజేతగా నిలిచిన బీజేపీ అభ్యర్థి, లోక్‌సభ ఎంపీ సంగీతా కుమారి సింగ్‌ దేవ్‌ పోటీపడుతున్నారు.
- అసికా, కంధమల్‌, బొలంగీర్‌, బర్‌గడ్‌, సుందర్‌గడ్‌ లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ స్థానాల్లో 40 మంది అభ్యర్థులు, 35 అసెంబ్లీ నియోజకవర్గాలకు 265 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. 79,62,148 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.
- 2019 ఎన్నికల్లో బిజూ జనతా దళ్‌ అసికా, కంధమల్‌ స్థానాలను గెలుచుకోగా మిగిలిన 3 స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంది. ఈసారి మొత్తం 5 స్థానాల్ని కైవసం చేసుకోవాలనే దృఢ సంకల్పంతో బీజేపీ హోరాహోరీగా ప్రచారం నిర్వహించింది. పశ్చిమ ఒడిశాలో కీలకమైన ఈ ప్రాంతాల్లో బలం రెండింతలుగా పెంచుకుంటామని అధికార బిజూ జనతా దళ్‌ సవాలు విసరడంతో పోరు రసవత్తరంగా మారింది. ఇరు పక్షాల ప్రముఖులు ప్రత్యక్షంగా తలపడుతున్నారు.
- ముఖ్యమంత్రి నవీన్‌ పట్నాయక్‌ గంజాం జిల్లా తన సొంత గడ్డ హింజిలి, పశ్చిమ ఒడిశా బొలంగీరు జిల్లా కంటాబంజి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. ఈ రెండు స్థానాల నుంచి గెలుపు తథ్యమని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు. 2019 ఎన్నికల్లో పశ్చిమ ఒడిశా బర్‌గడ్‌ జిల్లా బిజేపూర్‌, గంజాం జిల్లా హింజిలి రెండు అసెంబ్లీ స్థానాల నుంచి నవీన్‌ పోటీ చేసి రెండు చోట్లా గెలుపొందారు. తదుపరి దశలో పశ్చిమ ఒడిశాకు మొండిచేయి చూపారు.
- ప్రముఖ గిరిజన నేత జుయల్‌ ఓరం సుందర్‌గఢ్‌ లోక్‌సభ స్థానం నుంచి వరుసగా 8వ సారి పోటీ చేస్తున్నారు. మాజీ కేంద్ర మంత్రి, బీజేడీ అభ్యర్థి, హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్‌ టిర్కీ కాంగ్రెస్‌కు చెందిన జనార్దన్‌ దేహూరితో ముఖాముఖి పోటీ పడుతున్నారు.

బరిలో భార్యాభర్తలు..
బొలంగీరు జిల్లా రాజవంశీకులు సంగీతా కుమారి సింగ్‌దేవ్‌, కనక వర్ధన్‌ సింగ్‌దేవ్‌ ఈ విడతలో బరిలో ఉన్నారు. వీరివురు భార్యాభర్తలు. భార్య బొలంగీరు లోక్‌సభ, భర్త పట్నాగొడా శాసన సభ స్థానం నుంచి భారతీయ జనతా పార్టీ అభ్యర్థులుగా ప్రత్యర్థులకు ధీటైన పోటీనిస్తున్నారు. బొలంగీర్‌ నుంచి భారతీయ జనతా పార్టీ ఎంపీ సంగీతా సింగ్‌ దేవ్‌ బీజేపీ పార్టీ టిక్కెట్‌పై నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. ఈసారి కూడా ఎన్నికవ్వాలనే ఉత్సాహంతో ఆమె ధీటైన పోటీనిస్తున్నారు. ఆమె బీజేడీ అభ్యర్థి సురేంద్ర సింగ్‌ భోయ్‌, కాంగ్రెస్‌ అభ్యర్థి, రాజకీయవేత్తగా మారిన సినీ నటుడు మనోజ్‌ మిశ్రాతో త్రిముఖ పోటీలో తలమునకలై ఉన్నారు. సంగీత సింగ్‌దేవ్‌ భర్త, రాష్ట్ర శాఖ బీజేపీ మాజీ అధ్యక్షుడు కనక వర్ధన్‌ సింగ్‌ దేవ్‌ పట్నాగఢ్‌ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. ఆయన బీజేడీ సిట్టింగ్‌ ఎమ్మెల్యే సరోజ్‌ మెహర్‌తో పోటీ పడుతున్నారు.

అంతా నిశ్శబ్దం..
రెండో దశ పోలింగ్‌కు సంబంధించిన హై-వోల్టేజీ ప్రచారానికి శనివారం సాయంత్రం తెరపడింది. చివరి క్షణం వరకు ఉభయ అధికార బీజేడీ, ప్రతిపక్ష బీజేపీ అగ్రనేతలు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ప్రయత్నించారు. పూర్వ వైభవం కూడగట్టుకునేందుకు కాంగ్రెస్‌ నేతలు సైతం శాయశక్తులా ప్రయత్నించారు. ఓటరు నిర్ణయం పట్ల ఉత్కంఠ నెలకొంది.

హేమాహేమీల ప్రచారం..
ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో పాటు బీజేపీ పాలిత రాష్ట్రాలైన అస్సాం, ఛత్తీస్‌గఢ్‌, రాజస్థాన్‌ ముఖ్యమంత్రులు సహా బీజేపీ ప్రముఖుల బృందం రాష్ట్రంలో సుడిగాలి పర్యటనలు చేశారు. మారథాన్‌ బహిరంగ సభల్లో ప్రసంగించారు. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌, కలల రాణి ఎంపీ హేమమాలిని కూడా బీజేపీ అభ్యర్థులకు మద్దతు కోరుతూ రాష్ట్రంలో చివరి క్షణంలో ప్రచారం చేసి ఓటర్లని విశేషంగా ఆకట్టుకున్నారు. అధికార బిజూ జనతా దళ్‌ అధినేత ముఖ్యమంత్రి నవీన్‌ పట్నాయక్‌, ఆయన సన్నిహిత సహచరుడు వి.కార్తికేయ పాండియన్‌ భారీ స్థాయిలో ఎన్నికల ప్రచార సభలో పాల్గొని ప్రసంగించారు. అదేవిధంగా కాంగ్రెస్‌ అధ్యక్షుడు మల్లికార్జున్‌ ఖర్గే, పార్టీ అధినేత, ఎంపీ రాహుల్‌ గాంధీ కంధమల్‌, బొలంగీర్‌లలో రెండు సమావేశాల్లో ప్రసంగించారు.

బలగాలు సిద్ధం..
రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి నికుంజ బిహారీ ధొలా సమాచారం ప్రకారం, 5 లోక్‌సభ నియోజకవర్గాల్లో 9,162 పోలింగ్‌ బూత్‌లలో 40.33 లక్షల మంది పురుషులు, 39.35 లక్షల మంది మహిళలు సహా మొత్తం 79.69 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 9,162 పోలింగు కేంద్రాల్లో 20 శాతం సమస్యాత్మక, క్లిష్టమైన పోలింగ్‌ కేంద్రాలు ఉన్నట్లు ఆయన తెలిపారు. వాటిలో కొన్ని నక్సల్స్‌ ప్రభావిత కేంద్రాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శాంతియుతంగా పోలింగ్‌ నిర్వహించేందుకు 100 కంపెనీలకు పైగా కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సీఆర్‌పీఎఫ్‌)ను మోహరించినట్లు తెలిపారు.

రెండో దశకు సర్వం సిద్ధం

- రంగంలోకి ప్రత్యేక బృందాలు
- నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు: డీజీపీ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ అరుణ్‌కుమార్‌ షడంగి

భువనేశ్వర్‌: ఒడిశాలో సోమవారం జరగనున్న రెండో దశ ఏకకాల ఎన్నికలు శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తామని రాష్ట్ర డైరెక్టర్‌ జనరల్‌ ఆఫ్‌ పోలీస్‌ అరుణ్‌కుమార్‌ షడంగి తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో సజావుగా, నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా ఎన్నికలు జరిగేలా విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఐదు లోక్‌సభ స్థానాలైన బర్‌గఢ్‌, సుందర్‌గడ్‌, బొలంగీర్‌, కంధమల్‌, అసికా, అనుబంధ 35 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 11 జిల్లాల్లో జరిగే రెండో విడత ఎన్నికల కోసం 33,000 మంది పోలీసులు, 102 కంపెనీల కేంద్ర సాయుధ బలగాలను మోహరిస్తున్నట్లు డీజీపీ తెలిపారు.

రంగంలోకి ప్రత్యేక బృందాలు..
ప్రతి పోలింగ్‌ కేంద్రంలో ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించేందుకు సంచాలక పోలీసు బృందాల్ని రంగంలోకి దింపినట్లు డీజీపీ తెలిపారు. ప్రతి 10 నుంచి 12 పోలింగు కేంద్రాలకు ఒక్కో సంచాలక పోలీసు బృందం ఉంటుందని చెప్పారు. మొత్తం 655 సంచాలక పోలీసు బృందాల్ని మోహరించనున్నామని వివరించారు. అదనంగా 48 అంతర్‌ రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. 257 ఫ్లయింగ్‌ స్క్వాడ్‌ బృందాలు, 251 స్టాటిక్‌ సర్వైలెన్స్‌ బృందాలను సిద్ధం చేశామని తెలిపారు. 18 చోట్ల ఈవీఎం స్ట్రాంగ్‌ రూమ్‌లు ఏర్పాటైనట్లు పేర్కొన్నారు. స్ట్రాంగ్‌ రూమ్‌ల అంతర్గత భద్రతను కేంద్ర సాయుధ పోలీసు దళాలు సీఏపీఎఫ్‌ అందజేస్తుండగా, బయటి భద్రతను రాష్ట్ర పోలీసులు నిర్వహిస్తారని డీజీపీ తెలిపారు. రాష్ట్రంలోని నక్సల్స్‌ ప్రభావిత ప్రాంతాల్లోని పోలింగ్‌ బూత్‌ల వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఓటర్లు అధిక సంఖ్యలో తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

ఆయువు తీసిన ఆన్‌లైన్‌ గేమ్స్‌



సురాజ్‌ మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల ఎన్‌ఏసీ 11వ వార్డులో నివాసముంటున్న సురాజ్‌బాగ్‌ (22) అనే యువకుడు ఆదివారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నాడు. సురాజ్‌బాగ్‌ కొన్నాళ్లుగా ఆన్‌లైన్‌ గేమ్‌లకు బానిసయ్యాడు. ఈ క్రమంలో అప్పుల పాలుకావడంతో తండ్రి ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం తల్లి సంతోషబాగ్‌ ఇంటి పనులు నిమిత్తం బయటకు వెళ్లడంతో ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి తిరిగి వచ్చి చూసేసరికి వేలాడుతూ కనిపించడంతో కేకలు వేస్తూ ఇరుగుపొరుగుకు పిలిచింది. వారు వచ్చి చూసేసరికి మృతిచెందాడు. బలిమెల పోలీసులు మృతదేహన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

• కరుణించని వరుణుడు



కారుమబ్బులు

పర్లాకిమిడి: గజపతి జిల్లాపై వరుణుడు దయ చూపడం లేదు. కొద్దిరోజులుగా వర్షాలు లేక ఉక్కపోత, ఎండలతో ప్రజలు సతమతమవుతున్నారు. ఆదివారం సాయంత్రం మబ్బులు దోబూచులాడినా చివరకు చినుకులకే పరిమితమయ్యాయి. పర్లాకిమిడిలోనూ ఇదే పరిస్థితి నెలకొనడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

న్యూస్‌రీల్‌

గల్లంతైన యువకుడు మృతి



సుకుప్రధాన్‌ మృతదేహం

జయపురం: అమతాపుట్‌ జలాశయంలో గురువారం నాటు పడవ మునిగిన ఘటనలో గల్లంతైన సుక్కు ప్రధాన్‌ శవమై తేలాడు. నందపూర్‌ అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, కొరాపుట్‌ బృందాలు మూడు రోజులుగా గాలించగా ప్రధాన్‌ మృతదేహాన్ని కనుగొని ఒడ్డుకు చేర్చారు. ప్రధాన్‌ జీడిమామిడి తోటకు నాటు పడవలో వెళ్తుండగా జలాశయం మధ్య మునిగిపోయిన విషయం విదితమే.

శాంతియుత ఎన్నికలకు సహకరించండి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న సీఈఓ

భువనేశ్వర్‌ : శాంతియుతంగా ఎన్నికలు జరిగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నికుంజ బిహారి ధొలా కోరారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల పోల్‌ సంబంధిత హింసకు సంబంధించి భారత ఎన్నికల సంఘం పేర్కొన్న ఆందోళనలను వివరించారు. వీలైనంత త్వరగా సాధారణ పరిస్థితులు నెలకొనేందుకు అందరూ సహకరించాలని కోరారు.

సీనియర్‌ క్లర్క్‌పై వేటు

పర్లాకిమిడి: జిల్లా ముఖ్యశిక్షాధికారి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సీనియర్‌ క్లర్క్‌ వి.చంద్రశేఖర్‌ బెహరాను సంబంధిత శాఖ నుంచి తొలగిస్తూ రాష్ట్ర విజిలెన్స్‌ డైరెక్టర్‌ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రశేఖర్‌ గతంలో కాశీనగర్‌ బ్లాక్‌ విద్యాధికారి కార్యాలయంలో పనిచేస్తున్నప్పుడు ఓ ఉపాధ్యాయుని ఎరియర్‌ బకాయిల బిల్లు తయారుచేసేందుకు లంచం తీసుకుంటుండగా విజిలెన్స్‌ అధికారులకు చిక్కాడు. దీనిపై విచారించిన దక్షిణ మండళం బరంపురం విజిలెన్స్‌ న్యాయస్థానం చంద్రశేఖర్‌కు రెండేళ్ల జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఘనంగా బలిజాతర



జాతరలో పాల్గొన్న జనం

జయపురం: వ్యవసాయ సీజన్‌ మొదలుకావడంతో జయపురం సమితిలోని ఘాట్‌భగర్‌ గ్రామంలో శనివారం సాయంత్రం బలిజాతర ఘనంగా నిర్వహించారు. అక్షయ తృతీయ నాడు విత్తనాలు చల్లామని, శనివారం బలిజాతర నిర్వహించామని గ్రామపెద్దలు వెల్లడించారు. స్థానికులతో పాటు జయపురం, బొయిపరిగుడ, బొరిగుమ్మ, కుంద్ర తదితర సమితుల పరిధిలోని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆదివాసీ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శివ మాలి, ఘాశీ నొరియ, దిల్‌వార్‌ షాహా, లాలూ సాహెబ్‌, శివ నందో, దాసీయ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి హత్య



మృతుడు ప్రశాంత జెన్నా

పర్లాకిమిడి: గురండి పోలీసుస్టేషన్‌ పరిధిలోని సర్దాపురం వద్ద ప్రశాంత్‌ జెన్నా (24) అనే యువకుడు హత్యకు గురయ్యాడు. గుసాని సమితి అగరఖండి పంచాయతీ భిన్నల గ్రామానికి చెందిన వ్యాపారైన ప్రశాంత్‌ జెన్నా సర్దాపురం గ్రామానికి సొంత పనిపై వెళ్లగా పాతకక్షల నేపథ్యంలో ప్రత్యర్థులు దాడికి పాల్పడి తీవ్రంగా గాయపరిచారు. విషయం తెలుసుకున్న స్నేహితులు బాధితుడిని పర్లాకిమిడి ప్రభుత్వ కేంద్ర ఆస్పత్రికి తీసుకొస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. గురండి పోలీసుస్టేషన్‌ ఐఐసీ రవీంద్ర కుమార్‌ పాత్రో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మజ్జిగౌరి ఆలయానికి పోటెత్తిన భక్తజనం



అమ్మవారి దర్శనానికి మండుటెండలో వేచి ఉన్న భక్తులు



అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

రాయగడ: కోర్కెలు తీర్చే కల్పవల్లి, ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న రాయగడ మజ్జిగౌరి అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఓవైపు పొరుగు రాష్ట్రం ఆంధ్రలో ఎన్నికలు పూర్తి కావడం, మరోవైపు వేసవి సెలవులు ప్రకటించడంతో అమ్మవారి దర్శనానికి భక్తుల తాకిడి పెరిగింది. వేకువజాము 3.30 గంటలకు మంగళహారతితో పూజా కార్యక్రమాలు ప్రారంభించగా భక్తులు బారులు తీరారు. సుమారు కిలోమీటరు పొడవున క్యూలైన్లు నిండిపోయాయి. మండుటెండను సైతం లెక్కచేయకుండా అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. ప్రత్యేక దర్శనం రూ.300 టికెట్టు తీసిన వారు కూడా అధిక సమయం వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్థానికులతో పాటు ఆంధ్ర, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌, మధ్యప్రదేశ్‌ రాష్ట్రాల నుంచి సుమారు 50 వేల మంది భక్తులు వచ్చి ఉంటారని అంచనా. కొందరు భక్తులు మందిరం బయట నుంచే అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

కర్కమర్కలో గజరాజుల సంచారం



కర్కమర్క అడవుల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

రాయగడ: జిల్లాలోని మునిగుడ అటవీ రేంజ్‌ పరిధిలో కర్కమర్క అడవుల్లో ఏనుగుల గుంపు సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. గత కొద్ది రోజులుగా పొరుగు జిల్లా కలహండి నుంచి అటవీ మార్గంలో ఇక్కడకు వచ్చినట్టు అనుమానిస్తున్నారు. మునిగుడ సమితి అంబొదల, ఇచ్చాపొదొరొ పంచాయతీ పరిధుల్లోని పురకపాణి, మల్లిగా, డెడింగిసురా, బామదేవ్‌, కర్కమర్క గ్రామాల్లో ఇవి సంచరిస్తున్నట్లు గుర్తించారు. రెండు పెద్ద ఏనుగులు, 13 ఆడ ఏనుగులు, మరో ఏడు పిల్ల ఏనుగులు ఉన్నట్లు అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. స్థానికంగా ఉన్న పనస, అరటి పంటలను తినడానికి, నీటి కోసం గుంపులుగా వస్తున్నాయని చెబుతున్నారు. ఇంతవరకు ఏనుగుల వల్ల ఎటువంటి నష్టం జరగకపోయినా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారని అధికారులు అంటున్నారు. సిబ్బంది ఆయా గ్రామాలకు చేరుకుని నిఘా వేశారని గ్రామస్తులకు భరోసా ఇస్తున్నారు.

• ఉత్సాహంగా వేడుకలు



అలరించిన కోలాటం



బహుమతి అందుకుంటున్న విద్యార్థిని



అమ్మవారికి అలంకరించిన చీరలను అందజేస్తున్న కమిటీ సభ్యులు

స్థానిక మహారాణిపేటలో వైశ్యుల కులదేవత వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి జయంతి ఉత్సవాలు శనివారం రాత్రి ముగిశాయి. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. పెళ్లి కాని యువతులతో అమ్మవారికి పూజలు చేయించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

–జయపురం

క్లుప్తంగా

విశ్రాంత ఉద్యోగుల సేవలో ఎస్‌బీఐ



సమావేశంలో పాల్గొన్న రీజనల్ మేనేజర్ సుభాష్ చంద్ర బెహరా

జయపురం: విశ్రాంత ఉద్యోగులకు సముచిత సేవలు అందజేస్తున్నట్లు ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ సుభాష్‌చంద్ర బెహరా అన్నారు. జయపురం స్టేట్ బ్యాంక్ బజారు బ్రాంచ్ కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం విశ్రాంత పెన్షన్‌దారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

'లెక్కింపు ముగిసే వరకు ప్రత్యేక నిఘా వేయాలి'

టెక్కలి: సార్వత్రిక ఎన్నికల లెక్కింపు ప్రక్రియ ముగిసే వరకు ఎలాంటి అల్లర్లు జరగకుండా ప్రత్యేక నిఘా వేయాలని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ వెల్లడించారు. పోలీసు అధికారులు, ఎన్నికల సిబ్బందితో ఆదివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఇటీవల టెక్కలి నియోజకవర్గంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా చిన్నపాటి సంఘటనలు తప్ప మిగిలిన పోలింగ్ ప్రక్రియ ఎంతో ప్రశాంతంగా జరిగిందని, ఈ విషయంలో పోలీసుల సేవలు అభినందనీయమన్నారు. అలాగే లెక్కింపు ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల వాతావరణం ఉందనే విషయం ప్రజలకు తెలియాలన్నారు. ప్రతి మండలంలో అల్లర్లకు అవకాశం ఉన్న గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారిపై బైండోవర్ కేసులు నమోదు చేయాలన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రతి రోజు సుమారు పది గ్రామాల్లో పోలీసులు ప్రత్యేక పహారా నిర్వహించాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్ట్రాంగ్ రూమ్‌లో పోస్టల్ బ్యాలెట్ పత్రాలను భద్రపరచిన నేపథ్యంలో ప్రత్యేక నిఘా వేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ చోట్ల అల్లర్లు జరుగుతున్నాయని, టెక్కలి నియోజకవర్గంలో ఎలాంటి అల్లర్లు లేకుండా పోలీస్ సిబ్బంది ప్రత్యేక చొరవ చూపాలని నూరుల్ కమర్ పేర్కొన్నారు. లెక్కింపు ముగిసే వరకు ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేకంగా విధులు నిర్వర్తించాలని సబ్ కలెక్టర్ వెల్లడించారు. సమావేశంలో డీఎస్పీ బాలచంద్రారెడ్డి, ట్రైనీ డీఎస్పీ రాజా, సీఐ పైడయ్య, ఎస్‌ఐలు వెంకటేశ్వర్రావు, సిద్ధార్థకుమార్, కిశోర్ వర్మ, డీటీలు అనిల్, రాము, హరి, భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి

జలుమూరు: వైశాఖ మాసం బహుళ ఏకాదశి సందర్భంగా ఆదివారం సాయంత్రం శ్రీముఖలింగంలో వెలసిన మధుకేశ్వరుని తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించి స్వామివారికి ఏకవార అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను చక్కగా అలంకరించి పల్లకిలో ఆశీనులుగా చేశారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ తిరువీధి నిర్వహించగా భక్తులు హారతులిచ్చారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదిత్యుని కల్యాణం



ఆదిత్యుని కల్యాణంలో భాగంగా హారతినిస్తున్న అర్చకులు రంజిత్ శర్మ

అరసవల్లి: వైశాఖ శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో శ్రీ ఉషా పద్మిని ఛాయాదేవేరులతో స్వామి వారి కల్యాణ వేడుక ఘనంగా జరిగింది. ఆదివారం సాయంత్రం ఆలయ అనివెట్టి మండపంలో నిర్వహించిన ఈ ఉత్సవాన్ని ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి రంజిత్ శర్మలు జరిపించారు. కార్యక్రమంలో భాగంగా స్వామి దేవేరుల ఉత్సవమూర్తులను కల్యాణ మూర్తులుగా అలంకరించి ఆగమశాస్త్రం ప్రకారం కల్యాణాన్ని నిర్వహించారు. అలాగే కల్యాణ సేవలో పాల్గొనే భక్తదంపతులకు స్వామి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్ అరుణ దంపతులు, సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు, వేదపండితులు కన్నయ్య, పార్థసారథి, శ్రీనివాస శర్మ తదితరులున్నారు.

చోడవరంలో 30 మేకలు చోరీ

నరసన్నపేట: మండలంలోని చోడవరం ఎస్సీ కాలనీకి చెందిన బక్క నీలం పెంచుకుంటున్న 30 మేకలు శనివారం రాత్రి చోరీకి గురయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు లగేజీ వాహనంలో వచ్చి ఆ ఇంటి ఆవరణలో ఉన్న మేకలను తీసుకువెళ్లిపోయారు. ఉదయానికి తన ఇంటి ముందు మేకలు లేకపోవడంతో నీలం లబోదిబోమన్నారు. నరసన్నపేట పోలీసులకు ఈ మేరకు ఫిర్యాదు ఇచ్చినట్లు నీలం తెలిపారు. పోలీసులు వచ్చి పరిశీలించారు. చోరీకి గురైన 30 మేకలు రూ. 2 లక్షల విలువ చేస్తాయని అంచనా.

గజపతిలో గట్టెక్కేనా?

- జిల్లాలో రెండు స్థానాల గెలుపుకోసం బీజేడీ తీవ్ర ప్రయత్నాలు
- 2019లో మహిళా అభ్యర్థులను బరిలో దించినా నిరాశే
- ఈసారి గెలుపుపై తీవ్ర ఉత్కంఠ



పర్లాకిమిడి, మోహనా నియోజకవర్గాల బీజేడీ అభ్యర్థులు అంతర్యామి గొమాంగో, రూపేష్ పాణిగ్రాహి (ఫైల్)

పర్లాకిమిడి: అధికార బిజూ జనతా దళ్ పార్టీ గజపతి జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇక్కడి రెండు అసెంబ్లీ నియోజకవర్గాలైన పర్లాకిమిడి, మోహనా (ఎస్టీ) స్థానాలను కైవసం చేసుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. 2019 ఎన్నికల్లో ఇద్దరు మహిళా అభ్యర్థులను బరిలో దించినా నిరాశే ఎదురు కావడంతో ఈసారి ఎలాగైనా గెలుపు దక్కించుకోవాలని ముమ్మర ప్రచారం చేపట్టింది. గత ఎన్నికల్లో మోహనా నియోజకవర్గంలో బసంతీ మల్లిక్, పర్లాకిమిడి నియోజకవర్గంలో యువరాణి కళ్యాణీ దేవి గజపతిని పోటీలో దించారు. మోహనాలో కాంగ్రెస్ అభ్యర్థి దాశరథి గొమాంగో చేతిలో 2354 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. పర్లాకిమిడిలో మాజీ ఎంపీ గోపినాథ గజపతి కుమార్తె కళ్యాణీ దేవి గజపతి దేవి 266445 ఓట్లతో మూడవ స్థానంతో సరిపెట్టుకున్నారు. గత ఎన్నికల్లో పర్లాకిమిడిలో బీజేపీ అభ్యర్థి కోడూరు నారాయణరావు 52415 ఓట్లు సాధించి 15,335 ఓట్ల మెజార్టీతో సమీప స్వతంత్ర అభ్యర్థి తిరుపతి పాణిగ్రాహిని ఓడించారు. ఈ నేపథ్యంలో 2024 అసెంబ్లీ ఎన్నికల్లో అయినా అధికార బీజేడీ మోహనా, పర్లాకిమిడి స్థానాలు నిలబెట్టుకుంటుందా ? అని రాజకీయ పరిశీలకులు లెక్కలు కట్టుకుంటున్నారు. ఈసారి ఎన్నికల్లో బీజేడీ అభ్యర్థిగా తిరుపతి పాణిగ్రాహి తనయుడు, ఇంజినీర్ రూపేష్ పాణిగ్రాహి బీజేపీ అసిట్టింగ్ ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు, కాంగ్రెస్ అభ్యర్థి బిజయ పట్నాయక్ వంటి సీనియర్ నాయకులతో పోటీపడుతున్నారు. మోహనా నియోజకవర్గం నుంచి అంతర్యామి గొమాంగో బీజేడీ తరపున అదృష్టం పరీక్షించుకుంటున్నారు.

ఎన్నికల విధుల్లో ఉపాధ్యాయుడు మృతి



సుశీల్‌కుమార్ ఆచార్య(ఫైల్)

భువనేశ్వర్: రాష్ట్రంలో సోమవారం జరగనున్న రెండో విడత పోలింగ్ సన్నాహాల్లో అపశృతి చోటుచేసుకుంది. బొలంగీర్ జిల్లా ఎన్నికల కార్యకలాపాల కోసం నియమించిన ఉపాధ్యాయుడు గుండెపోటుతో మృతి చెందారు. మృతుడు ఒగాలాపూర్ మండలం పట్టుపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సుశీల్ కుమార్ ఆచార్యగా గుర్తించారు. పోలింగు విధుల్లో పాల్గొనేందుకు టిట్లాగఢ్ డీఏవీ కళాశాల డిస్పర్సల్ సెంటర్ నుంచి ఆదివారం ఈవీఎం, ఇతర ఎన్నికల సామగ్రిని సేకరిస్తున్న సమయంలో గుండెపోటుకు గురయ్యారు. వెంటనే తోటి సిబ్బంది టిట్లాగడ్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బొలంగీర్‌లోని భీమాభోయ్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్‌కు తరలించగా కాసేపటికే తుది శ్వాస విడిచారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. రాష్ట్రంలో 5 లోక్‌సభ, 35 అసెంబ్లీ నియోజకవర్గాలకు సోమవారం ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. బొలంగీర్ (ఎస్టీ) లోక్ సభ నియోజకవర్గం, 7 అసెంబ్లీ స్థానాలు బీరమహరాజ పూర్ (ఎస్సీ), సోన్‌పూర్, లొయిసింగ (ఎస్సీ), పట్నాగఢ్, బొలంగీర్, టిట్లాగఢ్, కంటాబంజి నియోజకవర్గాల్లో న్నికలు జరగనున్నాయి.

వ్యక్తి ప్రాణాలు కాపాడిన సత్యసాయి భక్తులు



కృత్రిమ శ్వాస అందించిన సత్యసాయి భక్తులు

కాశీబుగ్గ: ఉద్దాన ప్రాంతం గుడ్డిబద్ర గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అనారోగ్యంతో శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడుతుండటంతో సత్యసాయి బాబా భక్తులు ఆయన ప్రాణా లు కాపాడారు. పలాస మండలం రామకృష్ణాపురం శ్రీసత్యసాయి విద్యావిహార్ వారి సహకారంతో అందిస్తున్న అత్యవసర సేవల్లో భాగంగా ఆదివారం గుడ్డిభద్ర గ్రామం చేరుకుని ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌తో కృత్రిమ ఆక్సిజన్ అందించారు. కృత్రిమ శ్వాస ఉచితంగా అవసరం ఉన్నవారు సత్యసాయి భక్తులను సంప్రదించాలని కోరారు.

ఆభరణాలు చోరీ

బూర్జ: మండలంలో గల ఉప్పినివలస పంచాయతీ ఏబీసీ పేట గ్రామంలో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత గంగాడ రాజు అనే మహిళ మెడలో ఉన్న దాదాపు రెండు తులాల బంగారు ఆభరణాలు దొంగిలించారు. పుస్తెల తాడు, శతమానం, పుస్తెలు, ఆంజనేయ స్వామి బిళ్ల చోరీ చేశారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాజు భర్త రమణ రజక వృత్తితో పాటు కూలి పనులు చేస్తుంటారు. శనివారం సాయంత్రం ఆయన ఆమదాలవలస వెళ్లారు. వీరికి కొడుకు వర్ధన్, కూతురు పుష్పలత ఉన్నారు. రాత్రి భోజనం తర్వాత కొడుకు వర్ధన్ ఇంటి మేడ మీద పడుకున్నాడు. తల్లి రాజు ఇంటిలోనే నిద్రపోయారు. కొడుకు వస్తాడని తలుపులు వేయలేదు. అర్ధరాత్రి మెలకువ వచ్చి చూసే సరికి ఆమె మెడలో బంగారు ఆభరణాలు కనిపించలేదు. గట్టిగా కేకలు వేసి చూస్తే ఎవరూ లేరు. కొడుకును పిలిచి వెతికినా ఎవరూ కనిపించలేదు. విషయం భర్తకు చెప్పగా ఆయన ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇన్‌చార్జి ఎస్‌ఐ-2 ఐ.నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ నుంచి ఇద్దరు సీనియర్ నేతల బహిష్కరణ



బిరేన్ మోహన పట్నాయక్



దుర్గాశంకర సాహు

జయపురం: జయపురంలో ఇద్దరు సీనియర్ కాంగ్రెస్ నాయకులను పార్టీ నుంచి బహిష్కరిస్తూ ఆ పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు దుర్గా శంకర సాహు ఉరఫ్ బుల్లు సాహు, రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర ఆర్థిక, న్యాయ శాఖల మాజీ మంత్రి రఘునాథ్ పట్నాయక్ పెద్ద కుమారుడు బిరేన్ మోహన పట్నాయక్‌లను పార్టీ నుంచి ఉద్వాసన పలికినట్లు పీసీసీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ వెల్లడించారు. ఈ మేరకు పార్టీ క్రమశిక్షణా కమిటీ అధ్యక్షుడు సంతోష్ సింగ్ సాలుజ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బిరేన్ మోహన పట్నాయక్ కుమారుడు ప్రీతీష్ పట్నాయక్ ఈ నెల 13న జరిగిన సాధారణ ఎన్నికలో జయపురం నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ నేపథ్యంలో ఆరేళ్ల పాటు పార్టీ నుంచి బహిష్కరించారు. అదే విధంగా డీసీసీ మాజీ అధ్యక్షుడు దుర్గా శంకర సాహు కాంగ్రెస్ అభ్యర్థులకు వ్యతిరేకంగా ప్రచారం చేశారని ఫిర్యాదులు రావడంతో బహిష్కరణ వేటు పడింది.

దాడులు సహించబోము

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



అంధవరంలో రామును పరామర్శిస్తున్న కృష్ణదాస్

జలుమూరు: వైఎస్సార్ సీపీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చూసి ఓర్వలేని టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని, వీటిని సహించబోమని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఆయన ఆదివారం మండల పరిధిలోని లింగాలవలస, అంధవరం పంచాయతీల్లో బుక్కా లక్ష్మణరావు, సవలాపు రాములను పరామర్శించి మాట్లాడారు. ప్రజలు ధర్మం వైపు ఉన్నారని, రానున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని, మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. అంధవరంలో వైఎస్సార్‌సీపీకి ఉదయం నుంచి ప్రజలు అంతా ఓట్లు వేస్తున్నారని గ్రహించిన టీడీపీ నాయకులు సవలాపురపు రాముపై దాడిచేసిన సంగతి తెలిసిందే. లింగాలువలసలో కూడా తోపులాట జరిగింది. బాధితులను పరామర్శించిన వారిలో ఎంపీపీ వాన గోపి, మాజీ ఎంపీపీ బగ్గు రామకృష్ణ, పార్టీ అధ్యక్షులు కనుసు సీతారాం, సచివాలయ కన్వీనర్ ధర్మాన జగన్, అల్లాడ, చల్లవానిపేట సొసైటీ అధ్యక్షులు ఎం.శ్యామలరావు,పి.రాజప్పలనాయుడు, రేగాన శ్యామ్, ఆదిబాబు, గోవిందరావు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సారవకోట: మండలంలోని చిన్నకిట్టాలపాడు పంచాయతీ కురిడింగి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఒడిశాలోని పర్లాకిమిడి సమీపంలో ఉన్న రాణిపేటకు చెందిన ఎ.కాంతారావు, కె.యోగేశ్వరరావులు శ్రీకాకుళం నుంచి రాణిపేటకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కురిడింగి సమీపంలో ద్విచక్ర వాహనం బోల్తా పడటంతో తీవ్ర గాయాలపాలయ్యారు. వీరిని అర్లి టోల్‌గేట్ దగ్గర ఉన్న హైవే అంబులెన్స్‌లో పర్లాకిమిడి ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం తరలించినట్లు అంబులెన్స్ డ్రైవర్ రాము తెలిపారు.

కన్నుల 'పండుగ'



నృత్యం చేస్తున్న బారువ కాళీమాత వేషధారణ కళాకారుడు



అమ్మవారిని ఊరేగిస్తున్న బొరివంక సన్నాయి మేళం కళాకారులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని కమలాయిపుట్టుగ-లండపుట్టుగలో జరుగుతున్న అసిరిపోలమ్మ గ్రామ దేవత ఉత్సవాలు అంబరాన్ని తాకుతున్నాయి. ఆదివారానికి వారం రోజులకు చేరుకున్న ఉత్సవాల్లో కొణిసి అంజాట, బారువ కాళీమాత వేషధారణ, విశాఖపట్నం మహిళల కోలాటం, ఒడిరివంక సన్నాయి మేళం, ఒడిశా గారడీ విద్యతో గ్రామం పులకించిపోయింది. ఉత్సవాన్ని తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు పోటెత్తుతున్నారు

నేత్రపర్వంగా వెంకన్న కల్యాణోత్సవం



కల్యాణ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



వేడుకలో పాల్గొన్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని నారాయణ తిరుమలలో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం ఆదివారం నేత్రపర్వంగా జరిగింది. ఆలయ అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో శ్రీభూనీలా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను స్వర్ణాభరణాలతో అలంకరింపచేసి ఆలయ మహామండపంలో ప్రత్యేకంగా పూలతో అలంకరించిన ఆసనంపై కొలువుదీర్చారు. అనంతరం వివాహ వేడుకలను వేదమంత్రాల మధ్య పాంచరాత్ర ఆగమానుసారం నిర్వహించారు. ఎదురుగా భక్తులు కూర్చొని వివాహ వేడుకలను తిలకించారు. స్వామి ఉదయం వజ్రకవచ ధారణలో దర్శనమిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- నలుగురికి తీవ్ర గాయాలు



ట్రక్కును ఢీకొని నుజ్జయిన కారు



ప్రమాదంలో మరణించిన డ్రైవర్



క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

జయపురం: జయపురం-బొరిగుమ్మ 26వ నంబరు జాతీయ రహదారిపై జయంతగిరి కాలనీ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఆగి ఉన్న ట్రక్కును కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం రాత్రి జయంతిగిరి కాలనీ సమీపంలో ఓ ట్రక్కు ప్రమాదానికి గురైంది. దీంతో రోడ్డుపక్కనే నిలిపివేశారు. ఈ క్రమంలో జగదల్‌పూర్ నుంచి నలుగురు వ్యక్తులు కొరాపుట్ జిల్లాలోని ప్రసిద్ధ దేవమాలి పర్వత పర్యాటక ప్రాంతాన్ని సందర్శించేందుకు వెళ్లి తిరిగి కారులో బయలుదేరారు. జయంతిగిరి కాలనీ వద్దకు వచ్చే సరికి ఆగి ఉన్న ట్రక్కును కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం జగదల్‌పూర్‌కు చెందిన కారు డ్రైవర్ మైఖేల్ జొహన అక్కడికక్కడే మృతిచెందాడు. అదే ప్రాంతానికి చెందిన కపిల్‌మణి, అంశురాయ్, సౌరబ్, విశాల ఘోష్‌లు గాయపడ్డారు. వీరిని ఉమ్మిరి గ్రామ యువకులు అంబులెన్స్‌లో జయపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో కొరాపుట్‌లోని సహిద్ లక్ష్మణ నాయిక్ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బొరిగుమ్మ పోలీసు అధికారి జుగల్ కిశోర్ షా, సబ్‌కలక్టర్ రచిత మడకామి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బొరిగుమ్మ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాగావళిలో మునిగి బాలుడు మృతి



ద్విచక్రవాహనంపై బాలుడిని తీసుకెళ్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రాన్ని ఆనుకుని ఉన్న నాగావళి నదిలో మునిగి ఓ బాలుడు చనిపోయాడు. స్థానిక యువత బాలుడి ప్రాణాలను కాపాడేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. స్థానికులు, ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళ్తే.. నగరంలోని బాదుర్లపేటకు చెందిన పెంటబోయిన గురయ్య ఆటో నడుపుతూ భార్య, కుమారుడు, కుమార్తెతో జీవిస్తున్నాడు.

గురయ్య కుమారుడు రమేష్ (17) స్టిక్కరింగ్ షాపులో పనిచేస్తున్నాడు. ఆదివా రం సెలవు దినం కావడంతో ముగ్గురు స్నేహితుల తో కలిసి ఉదయం 11:30 గంటలకు కలెక్టర్ బంగ్లా సమీపంలోని వెంకటరమణమూర్తి గుడి వద్ద నాగా వళి నదిలోకి స్నానానికి వెళ్లాడు. అలా ఇసుకలో నడుచుకుంటూ కృష్ణమందిరం (ఇస్కాన్ టెంపుల్) వద్దనున్న నాలుగో పిల్లర్ సమీప ఒడ్డున ఇద్దరు స్నేహితులు ఉండిపోగా రమేష్ పవన్‌కుమార్ అనే మరో మిత్రునితో కలిసి నదిలో దిగాడు. పవన్ అవతలి ఒడ్డుకు ఈతకొట్టుకుంటూ వెళ్తుండగా ఈతరాని రమేష్ ఒక్కసారిగా లోతట్టు ప్రాంతం ఎదురవ్వడంతో ఊబిలో చిక్కుకుపోయి నీట మునిగాడు. ఈ హ ఠాత్పరిణామానికి ఒడ్డున ఉన్న ఇద్దరు స్నేహితులు కేకలు వేయడంతో సమీపంలో ఉన్న ముంతా గణేష్ అనే యువకుడు మరికొందరి యువకులతో కలిసి నదిలో దిగి వెదుకులాట ప్రారంభించారు. అరగంట సేపు వెతికాక నీటి అడుగున రమేష్ మృతదేహం పది అడుగుల లోతులో తగలడంతో మెల్లగా ఒడ్డుకు తీసుకొచ్చి సీపీఆర్ చేశారు. అప్పటికే సమాచారం తెలుసుకున్న రమేష్ తల్లిదండ్రులు అక్కడికి చేరి చలనం లేకుండా పడి ఉన్న కుమా రుడిని చూసి భోరున విలపించసాగారు.

సీపీఆర్ చేసేటప్పుడు నోటి నుంచి నురగ వచ్చి చిన్న కదలిక వచ్చినట్లు అనిపించడంతో యువత ద్విచక్రవాహనంపై హుటాహుటిన రిమ్స్‌కు తరలించారు. కానీ అప్పటికే చనిపోయినట్లు రిమ్స్ వైద్యులు ధ్రువీకరించడంతో ఎస్‌ఐ కామేశ్వరరావు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

చేపల వ్యర్థాలతో మీనామృతం



పాయితారిలో మీనామృతం తయారు చేస్తున్న కుమారి

ఇచ్ఛాపురం రూరల్: ఆకుచుట్టి తినే పురుగును పూర్తిగా అరికట్టే సామర్థ్యం చేపల వ్యర్థాలతో చేసే మీనామృతం ద్రావణానికి ఉందని ఐసీఆర్పీ కందాల కుమారి అన్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఆదివారం పాయితారి పంచాయతీలో చేపల వ్యర్థాలతో మీనామృతం తయారీ విధానంపై స్థానిక రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేంద్రీయ వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం వంటి సంప్రదాయ వ్యవసాయ పద్ధతుల్లో ఆధునిక క్రిమిసంహార కారకాలకు దీటైన లేదా పోల్చదగిన ప్రత్యామ్నాయం చేప ద్రావణమని అన్నారు. చేప కషాయం, చేప అమైనో ఆమ్లాలు ఉద్యానవన పంటల్లో చీడపీడల యాజమాన్యంలోనూ, పోషకాలను, వృద్ధి కారకాలను అందించడంలోనూ, భూసారాన్ని పెంపొందించడంలో రైతులకు ప్రయోజనకారిగా ఉంటాయని అన్నారు.

అక్రమంగా కంకర తరలిస్తున్న మూడు లారీలు సీజ్



సీజ్ చేసిన లారీలు

పొందూరు: పొందూరు పైడికొండ 42 సర్వే నంబర్‌లో అనుమతులు లేకుండా అక్రమంగా కంకర తవ్వి తరలిస్తున్న మూడు టిప్పర్ లారీలను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. మండలంలోని బొడ్డేపల్లి వద్ద జరుగుతున్న ట్రాక్ పనుల కోసం కంకరమట్టిని తరలిస్తున్నారు. అయితే ఇందుకు ఎలాంటి అనుమతులను రెవెన్యూ యంత్రాంగం మంజూరు చేయలేదు. పొందూరు తహసీల్దార్ కార్యాలయంలో అనుమతులు కోసం దరఖాస్తు చేసుకోగా రశీదు ఇచ్చారు. దీన్నే అనుమతిగా చూపుతూ అక్రమంగా కంకర మట్టిని 10 రోజులుగా భారీగా తరలిస్తున్నారు. కొద్ది రోజుల కిందట హెచ్చరించినా యథావిధిగా కంకర తరలింపు చేస్తున్నారు. దీంతో శనివారం తహసీల్దార్ కిరణ్‌పాల్‌కు ఫిర్యాదు రావడంతో రెవెన్యూ సిబ్బంది, పోలీసు సిబ్బందితో కలిసి దాడి చేసి టిప్పర్ లారీలను పట్టుకొని సీజ్ చేశారు. పైడికొండపై భారీగా తవ్వకాలు జరపడంతో కిందనున్న పంట పొలాలకు వర్షాకాలంతో నష్టం జరుగుతుందని ఆందోళన చెందుతున్నారు.

సారా తయారీ స్థావరంపై పోలీసుల దాడులు



జక్కరపేట గ్రామంలో సారా తయారీకి ఉపయోగించిన సామగ్రిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

మెళియాపుట్టి: మండలంలోని భరణికోట పంచాయతీ జక్కరపేట గ్రామంలో డీటీఎఫ్, ఎస్ఈబీ, ఇంటెలిజెన్స్ బృందాలు సమన్వయంతో ఆదివారం సారా తయారీ స్థావరంపై దాడులు నిర్వహించా యి. ఈ దాడుల్లో 1100 లీటర్ల పులిసిన బెల్లపు ఊ టలను ధ్వంసం చేశారు. శ్రీకాకుళం ఎస్ఈబీ జేడీ గంగాధరం సూచనల మేరకు దాడులు నిర్వహించినట్లు సిబ్బంది తెలిపారు. దాడుల అనంతరం అక్కడి ప్రజలకు నాటుసారా తయారీ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. సారా తయారీ, క్రయ విక్రయాలు మానుకోవాలని పిలుపునిచ్చారు. టెక్కలి ఎస్ఈబీ సీఐ రాజశేఖర్ నాయుడు, పలువురు సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాలు ప్రారంభం



ధ్వజారోహణ కార్యక్రమం జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాలు ఆదివారం రాత్రి నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా ఉపాలయంలో కొలువు దీరిన వేణుగోపాలస్వామి సన్నిధిలో విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ధ్వజస్తంబం వద్ద గరుత్మంతుడు చిత్రపటం ఎగురవేసి, ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామివారి కల్యాణ మహోత్సవాలను విజయవంతం చేయాలని సమస్త దేవతామూర్తులకు ఆహ్వానం పలికారు. ఐదు రోజుల పాటు స్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపిస్తామని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు నరసింహాచార్యులు, సాయిరామాచార్యులు, కిరణ్, రామగోపాల్, భక్తులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ సేవా కేంద్రంలో చోరీ

రామభద్రపురం: మండల కేంద్రంలో గల ఎస్‌బీఐ సేవా కేంద్రంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆరికతోటకు చెందిన పట్నాయకుని సత్యారావు ఐదేళ్లుగా ఎస్‌బీఐ సేవా కేంద్రం నిర్వహిస్తున్నాడు. ఈయన శనివారం మధ్యాహ్నం సేవా కేంద్రాన్ని మూసి ఇంటికి భోజనానికి వెళ్లాడు. వినియోగదారులు లేకపోవడంతో రెండో పూట కేంద్రాన్ని తెరవలేదు. ఆదివారం ఉదయం కేంద్రం తెరిచి చూడగా.. సామాన్లు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. ల్యాప్‌ట్యాప్, రూ. 1.66 లక్షల నగదు మాయమైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై జ్ఞానేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అయ్యో 'పాప'ం



పంట కాలువలో పసికందు మృత దేహం

పార్వతీపురం టౌన్: ఏ తల్లికి ఏ కష్టం వచ్చిందో గాని ఆ చిన్నారికి నూరేళ్లు నిండాయి. పొత్తిళ్లలో సేద తీరాల్సిన పసికందు పంట కాలువలో విగతజీవిగా కనిపించిన తీరు చూపరులను తీవ్ర ఆవేదనకు గురి చేసింది. వివరాల్లోకి వెళ్తే.... పార్వతీపురం పట్టణానికి ఆనుకుని కొత్తవలస వద్ద ఉన్న జంఝావతి పంట కాలువలో ఆదివారం ఉదయం పసికందు మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటన చూసి స్థానికులు పట్టణ పోలీసులకు సమాచారం అందజేశారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆడ శిశువుగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పార్వతీపురం పట్టణ సీఐ కృష్ణారావు తెలిపారు.

గాయపడిన యువకుడి మృతి



సునీల్‌కుమార్ మృతదేహం

సీతంపేట: కొద్ది రోజుల కిందట అడ్డాకులగూడ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో గాయపడిన సిరికొండ గ్రామానికి చెందిన కొండగొర్రి సునీల్ కుమార్ (20) శనివారం రాత్రి మృతి చెందాడు. ఏఎస్సై సంజీవ్ తెలియజేసిన వివరాలకు మేరకు.. రోడ్డు ప్రమాదంలో గాయపడిన సునీల్‌కుమార్‌ను శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సునీల్‌కుమార్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయాలతో ఆస్పత్రిలో ఉన్న వెంకటేష్

బొబ్బిలి: మండలంలోని మెట్టవలస, గొర్లె సీతారామపురం మధ్య ఉన్న చెరువు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. ఇందిరమ్మ కాలనీకి చెందిన ఎ.వెంకటేష్ బైక్ మీద రామభద్రపురం వైపు వెళ్తున్నాడు. ఇదే సమయంలో విజయనగరం నుంచి బొబ్బిలి వస్తున్న టాటా ఏస్ వాహనం ఇతడ్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేష్‌కు తీవ్ర గాయాలు కాగా, వ్యాన్‌లో ఉన్న బొబ్బిలికి చెందిన గుర్నాథరావుకు కూడా గాయాలయ్యాయి. వీరిద్దరినీ బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధులకు.. వడదెబ్బ ముప్పు..

- అప్రమత్తత తప్పనిసరి
- సమతుల ఆహారం తీసుకోవాలి
- ద్రవపదార్థాలు ఎక్కువగా సేవించాలి
- నీరసంగా ఉంటే వైద్యుడ్ని సంప్రదించాలి



సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధులు (ఫైల్)

విజయనగరం ఫోర్ట్: ఎండతీవ్రత రోజురోజుకూ అధికమవుతోంది. వేడిమి ప్రభావం ఎక్కువగా వృద్ధులపై పడి వడదెబ్బకు గురయ్యే ప్రమాదముంది. ఈ నేపథ్యంలో భానుడి ప్రభావం నుంచి తప్పించుకోవడానికి జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. ఏమాత్ర నీరసంగా ఉన్నా తక్షణమే వైద్యున్ని సంప్రదించాలి. 60 ఏళ్లు దాటిన వారు ఉదయం 8 గంటల్లోపు వ్యాయామం, నడక పూర్తి చేసుకోవాలి. మధుమేహంతో బాధపడేవారు వీలైనంత త్వరగా అల్పాహారం తీసుకోవాలి. వైద్యుల సలహా మేరకు వృద్ధులు జాగ్రత్తలు పాటించాలని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ బోళం పద్మావతి తెలిపారు.



బోళం పద్మావతి

ఎండలతో వచ్చే వ్యాధులు

ఎండ ధాటికి వృద్ధులు త్వరగా వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో ప్రస్తుతం జీవన ప్రమాణాలు పెరిగాయి. అయినప్పటికీ వృద్ధులు అప్రమత్తంగా ఉండడమే మేలని వైద్యులు చెబుతున్నారు.

హైపర్ థెర్మియా..

ఎండల్లో తిరగకుండా ఇంటిలో ఉన్నప్పటికీ అధిక ఉష్ణోగ్రతల వల్ల నీరసించిపోతారు. దీన్నే హైపర్‌థెర్మియా అంటారు. శరీరం స్వీకరించే దానికన్నా అధిక వేడిని తీసుకోవడం వల్ల ఈ సమస్య వస్తుంది.

హీట్ ఎగ్జాషెన్..

సాధారణంగా నాలుగు గంటలు ఎండల్లో తిరిగితే వడదెబ్బ సోకే అవకాశం ఉంటుంది. అయితే కొందరిలో ఒకటి రెండు గంటలు తిరిగితే వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. దీన్నే హీట్ ఎగ్జాషెన్ అంటారు.

వడదెబ్బ..

ఎండల్లో పనిచేసే వారు, తిరిగే వారు వడదెబ్బకు గురవుతారు. ముఖ్యంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య ఎండలు తీవ్రంగా ఉంటాయి. ఈ సమయంలో ఆరుబయట పనులకు వెళ్లకూడదు. తప్పనిసరి పరిస్థితుల్లో పనిచేయాల్సి వస్తే టోపీ ధరించడంతో పాటు వదులుగా ఉన్న దుస్తులు ధరించాలి.

యూరినరీ ఇన్‌ఫెక్షన్లు..

వేసవిలో వృద్ధులు యూరినరీ ఇన్‌ఫెక్షన్లకు గురయ్యే ప్రమాదం ఎక్కువ. మహిళల్లో మెనోపాజ్ వల్ల హార్మోన్ల మధ్య సమతుల్యత లేకపోవడం వల్ల.. పురుషుల్లో ప్రొస్టేట్ గ్రంధి సమస్యతో యూరినరీ ఇన్‌ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉంది.

వడదెబ్బ లక్షణాలు..

వడదెబ్బ తగిలిన వ్యక్తులు వెంటనే అపస్మారక స్థితికి చేరుకుంటారు. ముందుగా నీరసం, ఆయాసం, కళ్లు తిరగడం, వాంతులు, అలసిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. తర్వాత అపస్మారక స్థితికి చేరుకుంటారు. ఇలాంటి వారికి సకాలంలో వైద్యం అందించాలి. వైద్యుని వద్దకు తీసుకెళ్లే లోపే నీడలో పడుకోబెట్టి చల్లగాలి తగిలేలా చర్యలు తీసుకోవాలి.

ముందస్తు నివారణ చర్యలు..

వడదెబ్బ సోకకుండా ముందుస్తు నివారణ చర్యలు తీసుకోవడం ఉత్తమం. రోజుకి వివిధ రూపాల్లో 3 నుంచి 5 లీటర్ల ద్రవ పదార్థాలు తీసుకోవాలి. మంచినీరు, కొబ్బరి నీరు, మజ్జిగ, పండ్లరసాలు ఎక్కువగా తీసుకోవాలి. మసాలా పదార్థాలు, మాంసాహారం వీలైనంత వరకు తగ్గించాలి. తేలికగా జీర్ణమయ్యే సమతుల ఆహార పదార్థాలు తీసుకోవాలి.

కిడ్నీ, గుండె వ్యాధిగ్రస్తుల జాగ్రత్తలు..

ముఖ్యంగా వయస్సు మీద పడ్డవారికి ఆరోగ్య సమస్యలు సర్వసాధారణం. వీరిలో అధికంగా కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధులు బారిన పడిన వారు ఎక్కువగా ఉంటారు. వారు వాడే మందుల మోతాదు, శరీర స్థితిగతులకు అనుగుణంగా వైద్యుల సూచనలు మేరకు ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. అలాగే శరీరంలో ఉప్పు శాతం తగ్గిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- కిడ్నీ, గుండె జబ్బులున్న వారు కొబ్బరి నీళ్లు తీసుకోకూడదు.
- వేసవిలో ఆపరేషన్ చేయించుకునే వృద్ధులు, వారు తీసుకుంటున్న మందుల వివరాలు, ముఖ్యంగా మానసిక వ్యాధికి మందులు వాడుతున్న వారు వైద్యులకు పూర్తి సమాచారం తెలియజేయాలి.
- సుగర్ వ్యాధి ఉన్న వారు బత్తాయి రసంలో అధిక శాతం నీటిని కలుపుకుని తాగాలి.

పిడుగుపాటుతో ఒకరి మృతి

శృంగవరపుకోట: పిడుగుపాటుతో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని వెంకటరమణపేటలో ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబ భారం మోస్తున్న యజమాని చనిపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. వెంకటరమణపేటకు చెందిన బొబ్బిల అప్పలస్వామి (29) నిత్యం గొర్రెలను మేతకు తోలుతూ ఉంటాడు. ఆదివారం ఉదయం 6 గంటల ప్రాంతంలో జీవాలను తోలుకుని కంచి పాటి రాము క్వారీ సమీపంలోని మెట్టకు వెళ్లాడు. సాయంత్రం 6 గంటల సమయంలో జీవాలు ఇంటికి చేరినా.. అప్పలస్వామి రాకపోవటంతో కుటుంబీకులు, ఇరుగుపొరుగు వారు గ్రామ శివారుల్లో వెతికారు. అయితే మెట్టపై అప్పలస్వామి విగతజీవిగా కనిపించడంతో, పిడుగుపాటుకు మృతి చెంది ఉంటాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. మృతుడికి భార్య, మూడు నెలల వయసున్న కుమారుడు, తల్లి, ఇద్దరు సోదరులున్నారు. ఇంటి బాధ్యతలు మోస్తున్న వ్యక్తి చనిపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.




బొబ్బిలి అప్పల స్వామి (ఫైల్)

పందెంరాయుళ్లకు జైలుశిక్ష

నెల్లిమర్ల రూరల్: కోడి పందాలు ఆడుతూ పట్టుబడిన ఏడుగురు వ్యక్తులకు జిల్లా కోర్టు మూడు రోజుల సాధారణ జైలు శిక్ష, రూ.50 చొప్పున జరిమానా విధించిందని ఎస్సై రామగణేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 9న జగ్గరాజుపేట గ్రామ శివారులో కోడిపందాలు ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి నాలుగు కోడిపుంజులు, రూ.7,510 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి జిల్లా కోర్టులో సెకెండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీనివాసరావు ముందు హాజరుపరచగా, ముద్దాయిలకు జైలు శిక్షతో పాటు అపరాధ రుసుం విధిస్తూ తీర్పు చెప్పారని పేర్కొన్నారు.

వేసవిలో కూల్.. కూల్..

- పుచ్చకాయల్లో పోషక గుణాలు
- వేసవి తాపం నుంచి ఉపశమనం



విక్రయానికి సిద్ధంగావున్న పుచ్చకాయలు (ఇన్‌సెట్లో) ముక్కలుగా కోసిన పుచ్చకాయలు

పార్వతీపురం: మండుటెండల్లో ప్రయాణించే వారు పుచ్చకాయ ముక్క తింటే ఆ హాయి మాటల్లో వర్ణించలేనిది. ఎర్రగా నోరూరించే పుచ్చకాయ అంటే ఇష్టపడని వారు ఎవ్వరూ ఉండరనే చెప్పాలి. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో గ్రామాల్లో, ప్రధాన రహదారుల్లో, చెట్లకింద పుచ్చకాయల వ్యాపారం జోరందుకుంది. ఈ ఏడాది పుచ్చకాయల ధర కాస్త ఎక్కువగానే ఉంది. గతేడాది టన్ను పుచ్చకాయ రూ.10 వేల నుంచి 11 వేల రూపాయలు పలికింది. ప్రస్తుతం టన్ను రూ. 14 వేల నుంచి 15 వేల రూపాయల వరకు పలుకుతోంది. ఇది కాస్తా మరింత పెరిగే అవకాశం ఉందని సమాచారం. విజయనగరం జిల్లాలో పుచ్చకాయల సాగు తక్కువగా ఉంది. దీంతో విశాఖ, పశ్చిమ గోదావరి, కడప, ఖమ్మం, శ్రీకాకుళం, తదితర ప్రాంతాలనుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

పెరుగుతున్న దుకాణాలు..

వేసవి ఎండలు ముదురుతుండడంతో పుచ్చకాయల దుకాణాలను విరివిగా ఏర్పాటు చేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి పుచ్చకాయలను దిగుమతి చేసుకొని గ్రామాల్లోను, ప్రధాన మార్గాల్లో విక్రయిస్తున్నారు. కాయలు కిలోల వంతున నేరుగా విక్రయించడంతో పాటు ముక్కలుగా కోసి ఒక్కో ముక్క పది రూపాయలు చొప్పున అమ్ముతున్నారు. కొందరు చిన్న చిన్న ముక్కలుగా కోసి కప్పుల్లో వేసి ఉప్పు, కారం వేసి విక్రయిస్తుండగా.. మరి కొంతమంది జ్యూస్ తీసి మరీ విక్రయిస్తున్నారు. ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే ప్రయాణికులు పుచ్చకాయ ముక్కలు తిని వేడి నుంచి ఉపశమనం పొందుతున్నారు. పుచ్చకాయలు వారం, పది రోజుల పాటు నిల్వ ఉండే అవకాశం ఉండడంతో వ్యాపారులు లారీల లెక్కన దిగుమతి చేసుకుని విక్రయాలు సాగిస్తున్నారు. సుగర్ బేబీ (మహారాష్ట్ర సాగయ్యే రకం), నాన్‌దారి (మన రాష్ట్రంలో సాగు చేసే ఓ రకం), ఆర్కిమెన్, మధుబాల, తదితర రకాల కాయలకే డిమాండ్ ఎక్కువగా ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

విలువైన పోషకాలు

పుచ్చలో విటమిన్ బి, పొటాషియం, ఎలక్ట్రోలైట్లు పుష్కలంగా ఉంటాయి. కొలస్ట్రాల్ ఉండదు. వీటి వల్ల నిస్తేజితమైన శరీరానికి కొత్త శక్తి లభిస్తుంది. పుచ్చకాయలో 92 శాతం ఆల్కలైన్‌తో పాటు పీచు పదార్థం ఉండడం వల్ల శరీరానికి, మూత్రపిండాలకు, మూత్రనాళాలకు ఎంతో ఉపయోగకరం. పుచ్చకాయ తినడం వల్ల మలబద్ధకం నివారించబడుతుంది. ఇందులో ఉండే బీటా కెరోటిన్ రోగ నిరోధకశక్తిని పెంచుతుంది. వృద్ధాప్యంలో వచ్చే అంధత్వ సమస్యను నివారిస్తుంది. అలాగే ఆస్తమా, మధుమేహం, ఆర్థరైటీస్ సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. రక్తప్రసరణ సక్రమంగా జరిగేలా చేస్తుంది. ఇదిలా ఉంటే పుచ్చకాయ సౌందర్య సాధనంగా కూడా ఉపకరిస్తుంది. 100 గ్రాముల పుచ్చకాయలో 91.45 గ్రాముల నీరు, 6 శాతం చక్కెర , 30 క్యాలరీల శక్తి, 7.6 గ్రాముల పిండి పదార్థాలు, 0.6 గ్రాముల మాంసకృత్తులు, 12 గ్రాముల పొటాషియం, 7 గ్రాముల కాల్షియం, మిల్లీగ్రామ్ సోడియం చొప్పున ఉంటాయి.

సామాన్యులకు అందుబాటులో

వేసవిలో దాహార్తిని తీర్చుకోనేందుకు సామాన్యులకు సైతం పుచ్చకాయలు అందుబాటులో ఉంటున్నాయి. వేసవి తీవ్రతను తట్టుకొనేందుకు పుచ్చకాయలు ఎంతో ఉపయోగపడతాయి. తక్కువ ధరకే విలువైన పోషకాలున్న పండు లభిస్తుండడం అదృష్టం

– బి.పకీరునాయుడు, వల్లరగుడబ

ధరలు ఎక్కువ..

సీజన్ ప్రారంభం కావడంతో పాటు పంట తక్కువ కావడంతో పుచ్చకాయ ధర మార్కెట్‌లో అధికంగానే ఉంది. ప్రస్తుతం వ్యాపారం బాగానే ఉంది. మరికొద్ది రోజులు ఎండలు ఎక్కువగా ఉంటాయన్న సమాచారం ఉండడంతో వ్యాపారం మరింత జోరందుకొనే అవకాశం ఉంది.

– పి.లీలాకుమార్, వ్యాపారి, విశాఖపట్నం.

గ్రూప్-2 మెయిన్స్ పరీక్షకు ఉచిత శిక్షణ

- నేటి నుంచి దరఖాస్తుల ఆహ్వానం
- కె.సందీప్‌కుమార్, డైరెక్టర్, ఏపీ స్టడీ సర్కిల్ ఫర్ బీసీ



కె.సందీప్‌కుమార్, డైరెక్టర్, ఏపీ స్టడీ సర్కిల్ ఫర్ బీసీ

విజయనగరం అర్బన్: ఏపీపీఎస్‌సీ నిర్వహించే గ్రూప్–2 మెయిన్స్ పరీక్షకు సంబంధించిన ఉచిత శిక్షణను జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యర్థులకు అందజేస్తామని ఆంధ్రప్రదేశ్ స్టడీస్ సర్కిల్ ఫర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ డైరెక్టర్ కె.సందీప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణ కోరుకునే అభ్యర్థుల నుంచి ఈ మేరకు దరఖాస్తులను సోమవారం నుంచి ఈ నెల 24వ తేదీలోగా స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. పరిమితమైన 60 సీట్లతో ఈ శిక్షణ తరగతులు ఈ నెల 27వ తేదీ నుంచి 50 రోజుల పాటు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత శిక్షణతో పాటు స్టైపెండ్, స్టడీ మెటీరియల్ అందజేస్తామని వివరించారు. అభ్యర్థులు డిగ్రీ మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఎంపికైన ప్రిలిమినరీ పరీక్ష హాల్ టికెట్, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు రెండు దరఖాస్తుతో జతజేసి స్థానిక కస్పా స్కూల్‌లో ఉన్న స్టడీ సర్కిల్ కార్యాలయంలో ఈ నెల 24వ తేదీ లోగా అందజేయాలని సూచించారు. పూర్తి వివరాల కోసం ఫోన్ 9603557333, 91777726454, 8330967871 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

23న జాబ్ మేళా

పార్వతీపురం టౌన్: పార్వతీపురంలోని శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 23న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలపతిరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ జాబ్ మేళాలో పాల్గొనే ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీస్, డెక్కన్ కెమికల్స్, ఫాక్స్‌కాన్, ఆల్‌స్టామ్, డైకీ అల్యూమినియమ్ ఇండస్ట్రీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలలో రిలేషన్‌షిప్ మేనేజర్, బిజినెస్ ఎగ్జిక్యూటివ్, టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులై 35 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన అభ్యర్థులు జాబ్‌మేళాకు అర్హులని, ఆసక్తి గల అభ్యర్థులు ఆ రోజు ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9440127517 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఓహో అందాల మేఘమాల..!



కనువిందు చేసిన మబ్బులు

ఎడారిలో ఒయాసిస్సు ..మంచు ప్రాంతంలో చలిమంట కనిపించినట్లు..ఆకలితో నకనకలాడుతున్న వేళ పంచభక్ష్య పరమాన్నం దొరికినట్లు ఉదయం నుంచి తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో అల్లాడిన మనుషులు, పశుపక్ష్యాదులకు ఆకాశంలో విరిసిన మేఘమాలతో ఒక్కసారిగా ఉపశమనం కలిగింది. ఆకాశంలో మబ్బులు పట్టడంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. పాలకొండ మండలంలోని కొండాపురం గ్రామం వద్ద ఆదివారం సాయంత్రం కోనేరుపై నుంచి దర్శనమిచ్చిన మేఘాలు చల్లదనాన్ని పంచడంతో పాటు ఆహ్లాదకరంగా అందాల కనువిందు చేశాయి. – పాలకొండ

హెచ్‌ఐవీ రోగులకు మెరుగైన వైద్యసేవలు



కొవ్వొత్తుల ర్యాలీ ప్రారంభిస్తున్న డాక్టర్ రాణి

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో హెచ్‌ఐవీ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ కె. రాణి తెలిపారు. అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల సంస్మరణ దినం సందర్భంగా ఆదివారం రాత్రి స్థానిక జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం నుంచి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి మీదుగా ఆర్‌అండ్‌బీ వరకు నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హెచ్‌ఐవీ రోగులు ఏఆర్‌టీ మందులు క్రమంతప్పకుండా వాడి జీవిత కాలాన్ని పెంచుకోవాలన్నారు. ప్రజల్లో హెచ్‌ఐవీ వ్యాధి పట్ల అవగాహన పెరిగిందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్‌టీ మందులతో జీవిత కాలం పెంచుకోవచ్చు..

పార్వతీపురం టౌన్: హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా ఏఆర్‌టీ మందులు వాడితే జీవితం కాలం పెంచుకోవచ్చని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి ఎం.వినోద్ అన్నారు. హెచ్‌ఐవీతో చనిపోయిన వారిని గుర్తు చేసుకుంటూ వారి పట్ల ప్రేమ, సంఘీభావం తెలియజేద్దాం.. వారి కుటుంబ సభ్యుల బాధను నయం చేద్దాం'' అనే నినాదంతో ఆదివారం స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల సంస్మరణ దినం నిర్వహించారు. ముందుగా మృతులకు అంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులందరికీ మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని.. వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీడీ 4 కౌంట్ మిషన్ పార్వతీపురం కేంద్రాస్పత్రిలో అందుబాటులో ఉందన్నారు. ఎపిడమియాలజిస్ట్ డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ.. హెచ్‌ఐవీ రోగులు జాగ్రత్తలు పాటించాలని, ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకుని మందులు వాడాలని సూచించారు. జిల్లా పర్యవేక్షకుడు ఎన్. సాక్షి గోపాలరావు మాట్లాడుతూ.. హెచ్‌ఐవీ నిర్మూలనకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమములో వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, విజయ పాజిటివ్ నెట్‌వర్క్ సిబ్బంది, పాజిటివ్ నెట్‌వర్క్, వైడీఓ స్వచ్ఛంద సంస్థ , లింకు వర్కర్లు (చైల్డ్ ఫండ్ఇండియా), వైఆర్‌జీ కేర్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మృతులకు నివాళులర్పిస్తున్న సిబ్బంది

అమ్మవార్ల ఉత్సవం ప్రారంభం



దాడి తల్లి ఆలయం వద్ద భక్తుల సందడి

బొబ్బిలి: ఉత్తరాంధ్ర ఆరాధ్య దేవతలు గొల్లపల్లి దాడి తల్లి అమ్మవారు, పాత బొబ్బిలి సరిపోలమ్మ ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేశమ్మ తల్లిని గొల్లపల్లి పాత బొబ్బిలి తదితర 12 గ్రామాల ప్రజలు దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆయా ఆలయాలు సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. గొల్లపల్లిలో దాడి తల్లి అమ్మవారి ఉత్సవ కమిటీ, పాత బొబ్బిలిలో అనువంశిక ధర్మకర్త జోడి గంజి రమేష్ నాయుడు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి సోమవారం ఉయ్యాల కంబాల ఉత్సవాలను నిర్వహిస్తారు. మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు సిరిమాను ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఉత్సవాల సందర్భంగా కోలాటాలు, ప్రభల ఊరేగింపు నిర్వహిస్తారు.



పాత బొబ్బిలిలో ప్రభల ఊరేగింపు

స్టేజ్ ప్రదర్శనలు రద్దు

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సామూహికంగా ప్రజలు ఒకేచోట ఉండడం డీజేలు పెట్టడం, స్టేజీలపై సాంస్కృతిక ప్రదర్శనలు నిషేధమని సీఐ ఎం.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు ఉత్సవ కమిటీలు, గ్రామపెద్దలు ఈ సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.